# అందమైన బంధం

ఆకాశం చిల్లు పడినట్టు కుండపోతగా కురుస్తూంది వర్షం. మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో సాయంత్రం అయిదున్నరకే చీకటి పడినట్టు వుంది. కిటికీ తలుపులు వేసిన మాలతి అద్దాల మీద పడి జారిపోతున్న నీటిబిందువు లవైపు తదేకంగా చూస్తూ నిలబడింది. అలుక్కుపోయినట్టున్న అద్దంలో నుండి తడిసి వింత అందం సంతరించుకున్న వేపచెట్టు వయ్యారంగా కదులుతూ తమాషాగా కనబడుతూంది. అప్పుడప్పుడు ఒక్క మెరుపు మెరుస్తుంటే ప్రకృతి ఉలికిపడుతున్నట్టనిపిస్తూంది. భావనా జగతిలో తేలిపోతున్న మాలతికి టాక్సీ వచ్చి ఇంటిముందు ఆగిన చప్పుడు వినపడనేలేదు.

"దేవిగారేదో సుందర లోకాల్లో విహరిస్తున్నట్లున్నారు." సగం నడకా సగం పరుగుగ ఇంట్లోకి వచ్చిన రాజు రెయిన్ కోటు తీసి స్టాండుకు తగిలిస్తూ అల్లరిగా అన్నాడు.

ఉలికిపడి వెనక్కి తిరిగి చూసింది మాలతి. "అరె... తలంతా తడిసిపోయింది." ఆత్రంగా అంటూ దగ్గరగా వచ్చి కొంగుతో అతని తల తుడవసాగింది.

"తడవలేదంటుంటే ఎందుకా కంగారు? నేనేం చిన్న పాపాయినా? ఇంత దానికే జలుబు చేసి మంచమెక్కనులే..." భార్య నడుముచుట్టూ చేతులు వేసి దగ్గరికు లాక్కుంటూ నవ్వాడు రాజు.

"సరే తాతగారూ! డ్రెస్ మార్చుకోండి...కాఫి తెస్తాను... మెరుపులా తప్పించుకుని వంటింట్లోకి వెళ్ళింది మాలతి.

కాఫీ తాగి, పడక కుర్చీలో వాలిన రాజుకు పేపర్ అందించి అరుగుమీదికి వచ్చి నిలబడింది మాలతి. వర్షం కురుస్తుంటే ఆ ధారల మధ్య నుండి కనబడే చెట్లను కొండలను చూడ్డం ఆమెకిష్టం.

ఉండి ఉండి అరుగు మీదకి కూడా జల్లు కొడుతూంది మొహం మీద చల్లని నీటి తుంపర్లు పడుతుంటే, చలి చలిగా వున్న ఆ వాతావరణంలో అలా నిలబడి పోయింది మాలతి.

"మాలతీ! మైడియర్ మాలీ ఎక్కడున్నావ్" పిలుచుకుంటూ వచ్చిన రాజు చీకటిలో నిలబడిన మాలతిని ఆమె కట్టుకున్న తెల్లచీర వలన గుర్తుపట్టి దగ్గరగా వచ్చాడు "ఈ చలిలో నిలబడి ఏమిటమ్మడూ ఆలోచన?"

ఆ వానను చూస్తున్నాను. ఎంత బావుంది చూడండి! మధురమైన తలపులతో పులకించిపోయే నవ వధువులాలేదూ ప్రకృతి? సౌందర్య మధువును గోలి సోలిపోతు న్నట్టున్న అరమోడ్పు కనులతో మెత్తగా అన్నది మాలతి.

"కవిత్వమేమో బావుంది గానీ... వానను చూడటమేమిటి సిల్లీగా? చూడు జల్లుకొట్టి ఎలా తడిసిపోతున్నావో? భార్యను దగ్గరకు లాక్కుని నుదుటిమీద పడి తడిసి అలాగే అతుక్కుపోయిన ఆమె ముంగురులను సుతారంగా పైకి తోస్తూ అన్నాడు రాజు.

"ప్రకృతి కన్య శీతల కరస్పర్శకు ఉలికిపడి 'వణికినట్టుగా కదులుతున్న ఆకులను చూస్తుంటే ఎంత ఆహ్లాదంగా ఉంటుందనీ? ఇంకా అలా బయట నిలబడి వానలో తడిస్తే మరీ సరదాగా ఉంటుంది." అరుగు చివరకు వచ్చి నిలబడి వాన నీళ్ళను చేతులతో పడుతూ అంది మాలతి.

"ఆహా... సరదాగా వుండదూ మరి? రేపు జ్వరం వస్తే... ఇంజెక్షన్ పేరెత్తితే ఆమడదూరం పరిగెత్తు మళ్ళీ... పద పద" అంటూ బలవంతంగా లోపలికి నడిపించాడు.

"నేనేం చిన్న పాపాయినా ఈ మాత్రం దానికే జ్వరం రావడానికి?" గారంగా అతని మాటల్ని అతనికే ఒప్పచెప్పింది మాలతి.

"కాదు కాదు... పెద్ద పాపాయివి గనుకనే నాకు మరో పాపాయినివ్వబోతున్నావు గానీ కొంటెపిల్లా ముందు మొహం తుడుచుకో" అంటూ తలుపు వేయడానికి వెళ్ళాడు రాజు.

మాలతి కూర్చున్న చోటునుండి కదలలేదు.

"సరే! చెప్పిన మాట వినవుగదూ? నువ్వు తుడుచుకోపోతే నాకేం...."

దగ్గరగా వస్తున్న రాజు చేతిలోని టవలు లాక్కుని సున్నితంగా ముఖం మీది తడిని ఒత్తుకుంది.

"ఈ వెదర్‌లో వెచ్చగా లోపల కూర్చుని వేడి వేడి జీడిపప్పు పకోడీలు తింటూ పేకాడుతుంటే అదీమజా! మధ్యలో కాస్త హాట్ డ్రింకేదేనా వుంటే..." అల్లరిగా అంటున్న రాజు మాలతి చురుగ్గా చూడటం చూసి ఆగిపోయాడు.

"వద్దులే బాబోయ్! మరీ అంత కోపంగా చూడకు. మొన్న తెచ్చిన చిప్స్ వున్నాయిగా వాటితో సరిపెట్టుకుందాం" రాజు అల్మైరా దగ్గరకు నడిచాడు పేక తీసుకురావడానికి.

మాలతి సోఫాలోంచి లేచి వెళ్ళి కిటికీ దగ్గర నిలబడింది.

"రా మాలీ..." ముక్కలు పంచుతూ పిలిచాడు.

"నే రాను బాబూ! ఇంచక్కా ఈ వానను చూడక వెధవ పేకాటేమిటి?" విసుక్కుంది మాలది.

రాజుకు చికాకనిపించింది. "మళ్ళీ అదే మాటేనా? సరదాగా ఆడుకుందాం రమ్మంటే?"....

"చెప్పానుగా! పేకాటంటే అసహ్యం నాకు..." మొండిగా అన్నది మాలతి.

"ఎప్పుడు మాత్రం నా మాట చెల్లించావు గనుక"? కోపంగా ముక్కలన్నీ కలిపేసి లేచి డ్రాయింగ్ రూములో పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు.

X X X

సంధ్యా సూర్యుని అరుణారుణ కిరణాలు ప్రకృతి కాంతను మనోహరంగా అలంకరిస్తున్నాయి మేడమీద పిట్టగోడ నానుకుని నిలబడిన మాలతి, దూరాన కొండల చాటున సిగ్గుతో ఎర్రబడిన ముఖాన్ని దాచుకుంటున్న భానుని అందాలను పరవశించి చూస్తుంది. చిరుగాలికి అలనల్లన కదులుతున్న బిల్వ చెట్టు ఆకులు ఆమె సుందరవదనారవిందాన్ని చుంబించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

హడావుడిగా పైకి వచ్చిన రాజు అన్నాడు "మాలా త్వరగా రావాలి. మోహన్, సుమన నీ కోసం చూస్తున్నారు క్రింద."

అతని మాటలు వినిపించుకోనట్లే అన్నది మాలతి.

"అలా చూడండి! ఎన్ని రంగులున్నాయో ఆకాశంలో ఎరుపు, లేత నీలం, గాఢ నీలి వర్ణం, నలుపు.. అబ్బ ఏ చిత్రకారుని హస్తకళా నైపుణ్యమో ఈ అందం?"

'సరేగానీ నేను అంటున్నది నీకు వినిపించిందా? క్రింద గెస్ట్ ఎదురు చూస్తున్నారోయ్ అంటే కవిత్వాలు వల్లిస్తావు" అసహనంగా అన్నాడు రాజు.

"ఎవరొచ్చారు?" మొహంలో ప్రసన్నత మాయంకాగా అడిగింది మాలతి.

"వచ్చిచూస్తే తెలుస్తుంది విసురుగా మెట్లుదిగాడు రాజు.

ఇష్టం లేకుండానే అనుసరించింది మాలతి.

"ఏమండీ వచ్చిన ఇంత సేపటికా దర్శనం?" సుమన నవ్వుతూ పలుకరించింది.

"సారీ! మీరొస్తారని తెలసివుంటే వీధి గుమ్మంలోనే కాచుకుని వుండేదాన్ని" చిన్నగా నవ్వి కాఫీ తీసుకు రావడానికి లోపలికి వెళ్ళింది మాలతి.

"ఇంతకీ మీరు సిద్ధంగానే ఉన్నట్టున్నారుగా, ఇక బయల్దేరుదామా మరి?" సుమన వాచ్ చూసుకుంటూ అడిగింది.

"దేనికి సిద్ధంగా వుండడం? మాలతి ఆశ్చర్యపడింది.

"వాళ్ళు షాపింగ్‌కి వెడుతున్నార్ట. మనం కర్టెన్స్ అవీ కొనాలనుకున్నాంగా కంపెనీలో అయితే బావుంటుందని మేమూ వస్తాం కలిసిపోదామని తీసుకువచ్చాను." రాజు హుషారుగా చెప్పాడు.

"ఇంకా వంటకూడా కాలేదు. ఇప్పుడేం షాపింగు?" అయిష్టంగా అంది మాలతి.

"కాకపోతే పరవాలేదులే... వచ్చేటపుడు హోటల్లో భోజనం చేసివద్దాం పద?" కోపాన్నిదాచుకున్నా రాజు మాటలు కాస్త కఠినంగానే ధ్వనించాయి.

అతని ఆజ్ఞాపూరిత ధోరణికి మాలతి అహం దెబ్బతిన్నది. పట్టుదలా హెచ్చింది "అయితే మీరు వెళ్ళి తెచ్చేయండి ఆ కర్టన్స్ ఏవో... నేనురాలేను" స్థిరంగా అని సుమన వైపు తిరిగి మెత్తస్వరంతో "సారీ సుమనా! నాకు కాస్త తలనొప్పిగా కూడా వుంది, ఏమీ అనుకోకండి" అంది.

"డోంట్ డిస్టర్బ్ హర్ రాజూ! మీరు యాస్ప్రో వేసుకుని రెస్ట్ తీసుకోండి" అనేసి రాజు భుజంమీద చెయ్యివేసి బయటకు నడిచాడు రాజు.

"హ నిజం తలనొప్పి అయితే కదూ ఆస్ప్రో అవసరం! రావడం ఇష్టంలేక అదొక సాకు... కంపెనీలో తిరగలేని హోమ్‌బర్డు" మనసులో అనుకుంటూ పళ్ళు నూరుకున్నాడు రాజు.

రాత్రి పది గంటలకు వచ్చి బట్టలు మార్చుకుంటున్న రాజుతో ముభావంగా అన్నది మాలతి "వడ్డించాను"

"నేను వాళ్ళతో హోటల్‌లో భోజనం చేసే వచ్చాను నీలాగా బ్లంట్‌గా కంపెనీని తప్పించుకోవడం నాకు చేతకాదు మరి... వ్యంగ్యంగా అన్నాడతను.

"మంచిది ముందేచెప్తే వంట మానేసేదాన్నిగా" విసురుగా అని వెళ్ళి అన్నిటి మీద మూతలు వేసి వచ్చి పడుకుంది మాలతి.

ఆమె అన్నం తినలేదని కష్టంగా తోచినా మౌనంగా వుండిపోయాడు రాజు.

పొద్దున్న ఏడు కావస్తున్న ఇంకా ముసుగుదన్ని పడుకున్న రాజు దగ్గరకు మూడోసారి వచ్చి, అంతలో ముందు రోజు గొడవ గుర్తుకు రాగా, 'ఏం ఆయనకంత పట్టుదల అయితే నేను మాత్రం ఎందుకు మాట్లాడాలి' అనుకుని గప్‌చిప్‌గా బయటకు వచ్చేసింది మాలతి. అటుచూస్తే డికాషన్ దిగిపోయింది. ఒకవైపు ఇంకా ఎప్పుడుపోస్తావు కాఫీ' అంటూ ఆత్మారాముడు గోలచేస్తున్నాడు. రోజూ అయితే నిద్ర లేవడానికి మొండిచేసే శ్రీవారి మురిపాలన్నీ తీర్చి బాత్

రూముదాకా లాక్కొచ్చి పేస్ట్ బ్రష్ అందించేది. కానీ ఈ రోజు ఆమెలోని అహం తలెత్తి మెల్లిగా గిచ్చుతూంది.

ఉన్నట్లుండి మంచి ఆలోచన వచ్చింది మాలతికి. గూట్లోవున్న అలారం టైం పీస్‌తీసి పూర్తిగా కీఇచ్చి తీసుకు వెళ్ళి మంచం తలవైపుగా వున్న టేబులుమీద పెట్టివచ్చి చక్కా కాఫీ కలపసాగింది.

అలారం మ్రోగడంతో నిద్రమత్తు వదలిపోగా లేచి విసుగ్గా దాని గొంతు నొక్కి మొహం కడుక్కునివచ్చి హాల్లో కూర్చున్నాడు, రాజు. రోజులా వంటింట్లో తిష్టవేయక. కాఫీ తీసుకువచ్చి చప్పుడయేలా టీపాయ్‌మీద పెట్టి వంటింట్లోకి దూసుకుపోయింది మాలతి.

అలాగే స్నానానికి వేళయేసరికి బాత్ రాములో బకెట్ రణగొణధ్వని మొదలు పెట్టింది.

వంటయిందన్న సూచనగా వంటింట్లో పీటవేసిన చప్పుడూ కంచం పెట్టిన శబ్దం మరికాస్త గట్టిగా వినిపించాయి.

రాజు అన్నం తింటున్నంతసేపూ కావల్సింది వడ్డించి, కొత్త అల్లుడిముందు ఛాందసపు అత్తగార్లా తలుపు చాటుకు తప్పుకుంది మాలతి.

ఆఫీసుకు వెళ్తూ తలుపుతో 'వెళ్ళొస్తా' నని చెప్పి కదిలిన రాజు మనసులో అనుకున్నాడు, "చూస్తావుగా అమ్మాయ్! నీకు తగినపాఠం నేర్పకపోతానేమో...?"

రోజులా కొసరి కొసరి కంచంలో గ్రుమ్మరించే శ్రీవారు పక్కన లేకపోవడంతో ఆరోజు మాలతి అర్థాకలితోనే కంచముందు నుండి లేచేసింది.

వాతావరణం కాస్త చల్లబడి చప్పుళ్ళ సహాయంతో గాక మాటలతోనే పనులు జరగడం మొదయిన తర్వాత ఒకరోజు సాయంత్రం రాజు కిష్టమైన వెజిటబుల్ సమోసాలు చేసిపెట్టి మరీ చల్లగా ప్రోగ్రాం బయట పెట్టింది మాలతి.

"ఇవాళ ఆదివారమేగా కొత్త హిందీ సినిమా వచ్చిందట వెడదామా? వంట కూడా అయిపోయింది" గోముగా అన్నది.

"సెలవురోజన్నా విశ్రాంతి తీసుకోకుండా వెధవ సినిమాకేం వెళ్దాం లెద్దూ? అదీకాక హిందీ పిక్చరంటే నాకు తలనొప్పి కూడా" టిఫిన్ ముగించి తీరికగా సిగరెట్ కాలుస్తూ ఏమంత పట్టించుకోకుండా అన్నాడు రాజు.

నిముషంలో కోపం వచ్చేసింది మాలతికి. ఏ నెలకొకసారో నోరుతెరచి అడిగితే ఎంత నిర్లక్ష్యం? అనుకుని.

"అవునులెండి? వారంలో పాపం ఆరురోజులు బీజీగా వుంటారు. ఆదివారంనాడు రెస్ట్‌కావాలి అందులోనూ నాకిష్టమని తెల్సుగనుక హిందీ సినిమాలు అసలు చూడరు" ఉక్రోషంగా అంది.

"అంటే నీ ఉద్దేశ్యమేమిటి? నాకు తలనొప్పయినా నీవు రమ్మన్నావు గనుక గంగిరెద్దులా వెంటుండాలి అంతేనా? అంతగా అయితే చక్కగా విఠలాచార్య పిక్చరుందట పద పోదాం?" సాధ్యమైనంత గంభీరంగా అన్నారాజు కనుకొనలలో నవ్వు తొంగిచూస్తూనే వుంది.

"అంత యిష్టం లేనప్పుడు ఈ డొంకతిరుగుడు దేనికి? రానని కచ్చితంగా చెప్పేయవచ్చుగా? అయినా నాకు బుద్ధి లేదసలు... లేకపోతే మీ సంగతి తెల్సీ ముచ్చటపడి అడగడం కూడానా?.... మాటల్ని తుపాకి గుండ్లలా పేల్చేసి లోపలికి దూసుకుపోయింది మాలతి.

మర్నాడు నిజానికి కోల్డు వార్ ప్రారంభం కావల్సిందే గాని అనుకోకుండా మాలతి పెద్దక్కయ్య లలితమ్మ సతీ సమేతంగా దిగడంతో మాలతి తెల్లజెండా ఎగరేయక తప్పలేదు. రాజు కూడా సాదాగా ఏమీ జరగనట్టే బంధువులతో కులాసాగా మాట్లాడుతుండడం చూసి కాస్త చల్లబడింది మాలతి.

"అవునే... పెళ్ళయి అర్నెల్లు దాటినా పెళ్ళిలో తీసిన చిన్న ఫోటోలు తప్ప ముచ్చటగా మీరిద్దరూ ఒక పెద్ద ఫోటో తీసుకోనేలేదేం మాలా? మరిదిగారికి అటువంటి వాటిమీద అభిరుచి లేదేమిటి?" అన్నది లలితమ్మ ఒక శుభముహూర్తాన.

మాలతి నవ్వి వూరుకుంది. కానీ వాళ్ళక్కగారు ఆ పిల్లనంతటితో వదిలేయలేదు. "పదిరోజులలోగా మీ ఫోటో పంపకపోయావో నీతో మాట్లాడేది లేదు" అని బెదిరించి మరీ రైలెక్కింది.

రాజు మంచి మూడ్‌లో వుండగా విషయం కదిపింది మాలతి అంతటితో ఆగక "ఫుల్‌సూట్‌లో మీరెంత బాగుంటారో తెల్సా?" అంటూకాస్త గాలి కొట్టడానికి ప్రయత్నించింది.

"అవునోయ్... మా నాన్నా అదే మాటన్నాడు. అయితే ఒకటి... పెళ్ళిలో ఫోటోలు బాగా రాలేదనికదా వాళ్ళు మళ్ళీ తీయించుకోమని సరదా పడుతుంట? అందుకని నేను చక్కగా కుచ్చులు టోపి ధోవతి కట్టుకుని తలకు జరీ అంగ వస్త్రం చుట్టుకుంటే బావుంటుంది సూట్‌కన్నా మా నాన్నా ముచ్చటా, మీ అక్కయ్య కోరికా తీర్చినట్టుంటుంది." ముసిపెంగా అన్నాడు రాజు.

అసలే కోటేరువంటి ముక్కున్న మాలతికి కోపం ఆ ముక్కు చివరే వుంటుం దేమో భర్తగారి మాటలకు టపాకాయలా పేలిపోయింది.

"మీకేం ఆటలుగా వున్నట్టుందే చూస్తుంటే..." ఆ అవతారంలో వున్న మీ పక్కన నేను నిలబడతాననే? ఇంకా నయం నన్నుకూడా తెల్లజరీచీర గోచి బోసి కట్టుకోమనలేదు...."

"బ్రహ్మాండమయిన ఆలోచనస్మీ... నిజంగా ఆ డ్రెస్‌లో ఎంత ముద్దుగా వుంటావనీ మాలీ..." ఎగిరి గంతేసినంత పనిచేశాడు రాజు.

ఒళ్ళు తెలియని కోపంతో అంతకు ముందే అతను ప్రేమగా అందించిన పూలచెండు విసిరి నేలకు కొట్టి దూకుడుగా వెళ్లిపోయింది మాలతి.

రాజు చిదానందంగా నవ్వుకుని చిన్నగా విజిల్ వేసుకోసాగాడు.

ఇలా మొదలయిన యుద్ధం శాంతియుతంగానే అయినా తీవ్రంగానే కొనసాగింది మాటామంతి లేకుండా ఎవరికి వారు పనులు చేసుకోవడం, మరీ తప్పనిసరి అయినప్పుడు గోడలనో, తలుపులనో మధ్యవర్తులుగా ఉపయోగించు కోవడం జరిగింది. ఈ నిరశన వ్రతం సాగించడం ఇద్దరికీ కష్టంగానే ఉంది, మాలతి బాగా తెలుసు తను సరిగ్గా మాట్లాడనినాడు, సరదాగా ఉండనిరోజు. రాజు అన్నం కూడా సరిగ్గా తినడని కానీ దెబ్బతిన్న అభిమానం ఓటమి అంగీకరించనివ్వడం లేదు.

ఆ రోజు సాయంత్రం సుడిగాలిలా దుసుకువచ్చాడు రాజు "మాల... మైడియర్ మాలా... పలుకవేమి బేలా" అని రాగం తీస్తూ.

ఆశ్చర్యంతో మునిగిపోయిన మాలతి రెప్పవేయడం కూడా మర్చిపోయి నిలబడింది.

"ఏమిటోయ్ బొమ్మలా నిలబడ్డావ్? నువ్వన్న హిందీ పిక్చర్ ఇవాళ ఆఖరి రోజట... టికెట్స్ కూడా తెచ్చేసాను త్వరగా రెడీ కావాలి." భార్య బుగ్గమీద చిటికె వేసి హుషారుగా కూనిరాగంతీస్తూ మొహం కడుక్కోవడానికి వెళ్ళాడు రాజు. అతను వచ్చేసరికి కాఫీ టిఫిన్ తెచ్చి పెట్టి మౌనంగా కూర్చుంది మాలతి.

"అర్ధాంగివి గదా సగం తినకపోతే నాకెలా సహిస్తుంది డియర్... కమాన్..." ఆమె ముభావాన్ని ఏ మాత్రం గమనించనట్టే మురిపెంగా అన్నాడు రాజు.

పలకలేదు మాలతి.

"మూగనోము పట్టావేమిటి బాపూ బొమ్మా? నేను చెప్పింది వినపడిందా అసలు? టైమయిపోతుంది మళ్ళా..." రాజు హాస్యంగా అన్నాడు.

"మీకు తలనొప్పి అన్నారుగా..." నిష్ఠూరంగా అంది మాలతి.

"బావుంది... నాకిష్టం లేకపోతే నీ కోసం చూస్తాను సరేనా? అన్నట్టు మర్చిపోయాను చెప్పడం, రేపు ఫోటో గ్రాఫర్ని ఇంటికి రమ్మన్నాను, పది రోజుల్లో ఫోటో పంపిచమన్నారుగా మీ అక్కయ్య. రేపు పొద్దున్న నుండి సాయంత్రంలోగా నీకు నచ్చిన డ్రెస్ సెలక్టు చేసి వుంచాలిమనిద్దరికీ, తెల్సిందా? రాజు మిక్చర్ని పరాపరా నమిలేస్తూనే చెప్పుకుపోయాడు.

"నాకేం అర్థంకావటంలేదు, అప్పుడా నాటకమెందుకాడినట్టు" ఇంకా కోపంగానే అన్నది మాలతి."

రాజు గట్టిగా నవ్వాడు "నిజంగానే నాటకమే చిన్నారీ... నిజంగా ఇష్టాన్ని కాదని నీ మనసు నొప్పించడం నాకు సంతోషం అనుకున్నావా మాలీ? కేవలం నేనెలా ఫీలయ్యానో నీకు తెలియజెప్పడం కోసమే అలా చేసాను..."

"అంటే" అయోమయంగా చూసింది మాలతి.

"అంటే? మరేం లేదు హనీ! నీ ఇష్టాలు నీకూ, నా ఇష్టాలు నాకూ వుంటాయి, పేకాడ్డం నీకు నచ్చదు... హిందీ సిన్మాలు నాకు నచ్చవు. కానీ మరి నీకు నేనూ, నాకు నువ్వూ నచ్చాం గనుక కొంత అడ్జస్ట్‌మెంట్ అవసరమోయ్ అమ్మడూ! అది తెలియజెప్పడానికే చిన్న నాటకం ఆడాను. అఫ్‌కోర్స్! ఇలా దెబ్బలాడుకోవడం మజాగానే వుంటుందనుకో..." కొంటెగా నవ్వసాగాడు రాజు.

అతనివైపు కోపంగా చూస్తూ గారంగా అన్నది మాలతి. "చాల్లెండి! ఏడిపించినది చాలక."

"అమ్మమ్మా అలా కోరగా చూడకు చిట్టీ నాకు భయం. ఇక దేవిగారు తొందరగా తయారుకండి. సినిమా నుండి వచ్చాక తీరిగ్గా ఆలోచిద్దాం ఇంకే విషయం మీద తగవు పెట్టుకుంటే బావుటుందో..." రాజు నవ్వుతూ మాలతి భుజాలు పట్టిలేవదీశాడు.

"అడప దడప ఇద్దరూ అలిగితేనే అందం. అలకతీరి కలిసేదే అందమైన బంధం" అంటూ దూరాన్నుంచి జిక్కీ గొంతు వినబడుతూంది.

"జయశ్రీ" మాస పత్రిక

తేది : నవంబర్, 1972.